
సాక్షి
తూర్పుగోదావరి
గురువారం । 5 సెప్టెంబర్ । 2024



కంప్యూటర్ సమర్పణ

సఖినేటిపల్లి: అంతర్వేది లక్ష్మీనృసింహుని ఆలయంలోని నిత్యాన్నదాన ట్రస్టుకు బుధవారం బళ్ల చంద్రశేఖర్ (రామేశ్వరం) కంప్యూటర్‌ను సమర్పించారు.



గౌతమి ఎక్స్‌ప్రెస్ రద్దు

కాకినాడ: కాకినాడ నుంచి హైదరాబాద్ వెళ్లాల్సిన గౌతమి ఎక్స్‌ప్రెస్‌ను బుధవారం రద్దు చేశారు. విజయవాడలో వరదల నేపథ్యంలో రైల్వే అధికారులు ఈ నిర్ణయం తీసుకున్నారు.

శ్రీపాద శ్రీవల్లభ స్వామికి పూజలు



పిఠాపురం: పట్టణంలో ప్రముఖ దత్త క్షేత్రమైన శ్రీపాద శ్రీవల్లభ మహా సంస్థానంలో శ్రీపాద శ్రీవల్లభస్వామి జయంతి మహోత్సవాలు వైభవంగా జరుగుతున్నాయి. ఉత్సవాల్లో భాగంగా బుధవారం స్వామివారికి పల్లకీ సేవ, ప్రత్యేక పూజలు, అభిషేకాలు, అర్చనలు నిర్వహించారు.

న్యూస్‌రీల్

టీబీ, లెప్రసీపై అవగాహన కల్పించాలి



రికార్డులను పరిశీలిస్తున్న డాక్టర్ వసుంధర

కడియం: టీబీ, లెప్రసీ వ్యాధులపై ప్రజలకు మరింత అవగాహన కల్పించాలని జిల్లా ఎయిడ్స్, లెప్రసీ కంట్రోల్ ఆఫీసర్ డాక్టర్ ఎన్. వసుంధర ఆదేశించారు. కడియం హెల్త్ సెంటర్ 1, 3 పరిధిలో టీబీ, లెప్రసీ వ్యాధిగ్రస్తులకు అందుతున్న సేవలను బుధవారం ఆమె తనిఖీ చేశారు. అక్కడి రికార్డులను పరిశీలించి, రోగులకు అందుతున్న సేవలపై సిబ్బందిని ఆరాతీశారు. ఇంటింటికీ సర్వే సక్రమంగా నిర్వహించి అనుమానాస్పద లెప్రసీ కేసులను గుర్తించాలన్నారు. ఆమె వెంట టీబీ ప్రోగ్రాం జిల్లా సూపర్ వైజర్ సుందరి, టీబీ కడియం యూనిట్ సూపర్ వైజర్ శేషు, విల్సన్ పాల్, సిబ్బంది ఉన్నారు.

లెసెన్సు తప్పనిసరి

సీటీఆర్ఐ (రాజమహేంద్రవరం): జిల్లాలోని వ్యాపార, వాణిజ్య సంస్థలు, దుకాణాల యజమానులు, నిర్మాణ సంస్థలు, వివిధ రాష్ట్రాల కార్మికులను తీసుకువచ్చే సంస్థలు తప్పనిసరిగా కార్మిక శాఖ నుంచి లైసెన్సులు తీసుకోవాలని జిల్లా ఇన్‌చార్జి ఆఫీసర్, కార్మిక శాఖ సహాయ కమిషనర్ బీఎస్ఎం వలి అన్నారు. ఇప్పటికే లైసెన్సులు పొందినవారు రెన్యువల్ చేసుకోవాలన్నారు. అన్ని మీ సేవ కేంద్రాలలో ఈ-రిజిస్ట్రేషన్, రెన్యూవల్ సేవలు అందుబాటులో ఉన్నాయన్నారు. సెప్టెంబర్ 30వ తేదీలోగా రిజిస్ట్రేషన్ చేసుకోకపోతే చట్టపరమైన చర్యలు చేపడతామన్నారు.

పోలీసు విభాగంలో ఎస్సీలపై వివక్ష

రాజమహేంద్రవరం సిటీ: జిల్లా పోలీస్ డిపార్ట్‌మెంట్‌లో ఎస్సీ అధికారులపై వివక్ష చూపిస్తున్నారని స్వతంత్ర జనతా పార్టీ (రిపబ్లిక్) ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర అధ్యక్షుడు బర్రే ఆనంద్ కుమార్ అన్నారు. ఈ మేరకు ఆయన బుధవారం ప్రకటన విడుదల చేశారు. జిల్లాలో ఎస్సీ సామాజిక వర్గానికి చెందిన వారెవ్వరికి ఉన్నత పోస్టింగ్ దక్కకపోవడం విచిత్రంగా ఉందన్నారు. ఈస్ట్ జోన్, నార్త్ జోన్, సెంట్రల్ జోన్, సౌత్ జోన్, సిటీ ట్రాఫిక్, సెంట్రల్ క్రైమ్ విభాగాలలోని ఏ పోలీస్ స్టేషన్‌లోనూ ఎస్సై స్థాయి నుంచి డీఎస్పీ స్థాయి వరకు ఒక్క ఎస్సీ లేకపోవడం దారుణమన్నారు. ఈ విషయంపై ముఖ్యమంత్రి చంద్రబాబు, ఉప ముఖ్యమంత్రి పవన్ కల్యాణ్, హోం మంత్రి అనిత, జాతీయ ఎస్సీ కమిషన్, మానవ హక్కుల కమిషన్‌కు పార్టీ తరపున ఫిర్యాదు చేస్తున్నట్లు తెలిపారు.

జపాన్‌లో నర్సింగ్ ఉద్యోగ అవకాశాలు

బాలాజీచెరువు (కాకినాడ సిటీ): ఏపీ స్కిల్ డెవలప్‌మెంట్, నావిస్ హెచ్ఆర్ ఆధ్వర్యంలో ఏఎన్ఎం, జీఎన్ఎం, బీఎస్సీ చదివిన అభ్యర్థులకు జపాన్ దేశంలో నర్సింగ్ ఉద్యోగావకాశాలు కల్పిస్తున్నట్లు జిల్లా నైపుణ్య అభివృద్ధి అధికారి హరిశేషు బుధవారం తెలిపారు. జపాన్‌లో పని చేయడానికి 32 ఏళ్ల లోపు అభ్యర్థులు అర్హులని, ఆరు నెలల పాటు బెంగళూరు నావిస్ సంస్థలో శిక్షణ ఇచ్చి, ఆ దేశంలో ఉద్యోగం కల్పిస్తారన్నారు. ఫీజు రూ.3 లక్షలు చెల్లించాలని, ముందుగా రూ.25 వేలు అభ్యర్థి రిజిస్ట్రేషన్ ఫీజు చెల్లిస్తే రూ.25 వేలు స్కిల్ డెవలప్‌మెంట్ సంస్థ చెల్లిస్తుందన్నారు. మిగిలిన ఫీజు లోన్ సౌకర్యం కల్పిస్తారని, ఉద్యోగం పొందిన అభ్యర్థికి జపాన్‌లో రూ.1.10 లక్షల నుంచి రూ.40 వేల వరకూ వస్తుందన్నారు. లోన్ పొందిన అభ్యర్థులు ఉద్యోగం వచ్చాక తిరిగి చెల్లించవచ్చని, ఆసక్తి గలవారు ఈ నెల 10వ తేదీలోగా 94921 41999 నంబరులో సంప్రదించాలని సూచించారు.

యువకుడి దుర్మరణం

గండేపల్లి: రోడ్డు ప్రమాదంలో ఓ యువకుడు దుర్మరణం పాలయ్యాడు. పోలీసుల కథనం ప్రకారం.. అనకాపల్లి జిల్లా కోట ఊరట్ల మండలం, కొత్తూరు గ్రామానికి చెందిన కరణం నవీన్ (సిద్దు) (22) మోటార్ సైకిల్‌పై తన స్నేహితుడితో కలసి విజయవాడ వెళ్లాడు. అనంతరం తన స్వగ్రామం వస్తుండగా గండేపల్లి మండలం నీలాద్రిరావుపేట శివారుకు వచ్చే సరికి ఆగి ఉన్న ట్యాంకర్‌ను వెనుక నుంచి ఢీకొని రోడ్డుపై పడిపోయాడు. అతని తలకు బలమైన రక్తపు గాయమై అక్కడికక్కడే మృతి చెందాడు. ట్యాంకర్ డ్రైవర్ ఎటువంటి జాగ్రత్తలు పాటించకుండా తన ట్యాంకర్‌ను పార్క్ చేయడంతో ఈ ప్రమాదం జరిగింది. ఈ మేరకు మృతుడి చిన్నాన్న కరణం కృష్ణ ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేశామని గండేపల్లి ఎస్సై యూవీ శివ నాగబాబు తెలిపారు. మృతదేహాన్ని పోస్టుమార్టం కోసం పెద్దాపురం ప్రభుత్వ ఆసుపత్రికి తరలించామన్నారు. ప్రమాద స్థలానికి హైవే పెట్రోలింగ్ సిబ్బంది వచ్చి ట్రాఫిక్‌ను క్రమబద్ధీకరించారు.

వరుణాగ్రహం

- జిల్లాలో దంచికొట్టిన వర్షం
- ముంపు బారిన పల్లపు ప్రాంతాలు

సాక్షి, రాజమహేంద్రవరం: అల్పపీడన ప్రభావంతో జిల్లా వ్యాప్తంగా బుధవారం భారీ వర్షం కురిసింది. లోతట్టు ప్రాంతాలు జలమయమయ్యాయి. రాజమహేంద్రవరం రూరల్, కడియం, పెరవలి, తాళ్లపూడి మండలాలతో పాటు రాజమహేంద్రవరం సిటీలో అధిక వర్షపాతం నమోదైంది. రహదారులపై నీరు పొంగిపొర్లడంతో వాహనదారులు తీవ్ర ఇబ్బందులు పడ్డారు. రాకపోకలకు తీవ్ర అంతరాయం ఏర్పడింది. బుధవారం ఉదయానికి జిల్లాలో 36.3 మిల్లీ మీటర్లు కురిసింది. అత్యధికంగా పెరవలిలో 81.2, అత్యల్పంగా నల్లజర్లలో 2.8 మిల్లీ మీటర్లు కురిసింది. రాజమహేంద్రవరం అర్బన్‌లో 78.2, రాజమహేంద్రవరం రూరల్ 68.4, కడియం, తాళ్లపూడి 58.6, చాగల్లు 52, నిడదవోలు 45.4, ఉండ్రాజవరం 42.6, గోపాలపురం 29.2, దేవరపల్లి 26.8, రాజానగరం 26.2, సీతానగరం 16.8, అనపర్తి 15.2, కోరుకొండ 12, బిక్కవోలు 7.2, రంగంపేట 7.0, గోకవరం 3.4 మిల్లీ మీటర్ల చొప్పున నమోదైంది. దేవరపల్లి మండలంలో చెరువులు పొంగిపొర్లుతున్నాయి. కాలువలు నీటితో ఉధృతంగా ప్రవహిస్తున్నాయి. తాళ్లపూడి మండలంలోని పలు గ్రామాల్లో పల్లపు వీధులు ముంపునకు గురయ్యాయి. పెరవలి మండలంలో కూరగాయల పాదులు, అరటితోటల్లోకి నీరు చేరింది.



రాజమహేంద్రవరంలోని ఓ వీధిలో నిలిచిన నీరు



తాళ్లపూడి మండలం వేగేశ్వరపురంలో సీసీ రోడ్డుపై నిలిచిన నీరు

పెరిగిన గోదా'వడి'

ఎగువన కురుస్తున్న వర్షాలకు గోదావరిలో వరద ఉధృతి పెరిగింది. సాయంత్రం 6 గంటల సమయానికి భద్రాచలం వద్ద నీటి మట్టం 44.30 అడుగులకు చేరింది. ఆ ప్రభావంతో ధవళేశ్వరం కాటన్ బ్యారేజీ వద్దకు వరద నీరు భారీగా వచ్చి చేరుతోంది. సాయంత్రం ఆరు గంటలకు సర్ ఆర్థర్ కాటన్ బ్యారేజీ వద్ద నీటి మట్టం 13.57 అడుగులకు చేరింది. 1,800 క్యూసెక్కుల నీటిని కాలువలకు విడుదల చేశారు. మరో 6,86,602 క్యూసెక్కుల మిగులు జలాలు సముద్రంలోకి వదిలారు. వరద ప్రవాహం రాత్రికి మరింత పెరిగే అవకాశం ఉంది. భద్రాచలం వద్ద ప్రమాద హెచ్చరిక జారీ చేసిన దష్ట్యా ధవళేశ్వరం మొదటి ప్రమాద హెచ్చరిక కంటే ముందుగానే సహాయక చర్యలకు అధికారులు సిద్ధమవుతున్నారు. కొవ్వూరు, రాజమండ్రి డివిజన్ పరిధిలో బోట్లు సిద్ధం చేసుకోవాలని, లోతట్టు ప్రాంతాల ప్రజలను పునరావాస కేంద్రాలు తరలించడానికి సిద్ధంగా ఉండాలని కలెక్టర్ ప్రశాంతి ఆదేశించారు.



పెరవలి మండలం అన్నవరప్పాడులో నీటమునిగిన అరటితోట



భారీ వర్షాలకు దేవరపల్లి మండలం యర్నగూడెంలో పొంగిపొర్లుతున్న గండి చెరువు

భారీ వర్షాలతో ముందస్తు రక్షణ చర్యలు



అధికారులతో వీడియో కాన్ఫరెన్స్ నిర్వహిస్తున్న కలెక్టర్ ప్రశాంతి

రాజమహేంద్రవరం సిటీ: భారీ వర్షాలు కురుస్తున్న నేపథ్యంలో క్షేత్రస్థాయిలో అధికారులు అప్రమత్తంగా ఉండి తగిన జాగ్రత్తలు తీసుకోవాలని, పునరావాస కేంద్రాలలో అన్ని వసతులను సిద్ధం చేయాలని కలెక్టర్ పి.ప్రశాంతి ఆదేశించారు. నగర పాలకసంస్థ కార్యాలయం నుంచి బుధవారం అధికారులతో వీడియో కాన్ఫరెన్స్ నిర్వహించారు. జిల్లాలో విస్తారంగా కురుస్తున్న వర్షాలు, గోదావరికి పెరుగుతున్న వరద నేపథ్యంలో జాగ్రత్తలపై పలు ఆదేశాలు జారీ చేశారు. ధవళేశ్వరానికి భారీగా వరద నీరు నీరు చేరే అవకాశం దృష్ట్యా అప్రమత్తంగా వ్యవహరించాలన్నారు. ముందుగానే లోతట్టు ప్రాంతాలు, ముంపునకు గురయ్యే లంక గ్రామాల్లో ప్రజలను పునరావాస కేంద్రాలకు తరలించాలన్నారు. బ్రిడ్జిలంక, ములకల్లంక ప్రాంతాల్లో పరిస్థితిని సమీక్షించాలన్నారు. సూరంపాలెం, కొవ్వాడ, ఎర్రకాలువ, ధవళేశ్వరం బ్యారేజీ ప్రాంతాల్లో గండ్లు పడే అవకాశం ఉన్న, ముంపునకు గురయ్యే అవకాశం ప్రాంతాలలో ముందస్తు రక్షణ చర్యలను తీసుకోవాలన్నారు. మత్స్యకారులు వేటకు వెళ్లకుండా నిషేధం అమలు చేయాలన్నారు. వర్షాలు, గాలుల కారణంగా కూలిపోయిన చెట్లను తక్షణం తొలగించడానికి తగిన ఏర్పాట్లు సిద్ధం చేసుకోవాలన్నారు. సచివాలయ సిబ్బందికి సెలవులు ఇవ్వొద్దని, 24 గంటలూ అందుబాటులో ఉంచాలన్నారు.

జాతీయ రహదారిపై రోడ్డు ప్రమాదం

- ఒకరి మృతి, మరొకరికి గాయాలు
- ఘటన చూసి చలించిన కలెక్టర్ షణ్మోహన్
- ఆసుపత్రికి బాధితుల తరలింపు

ప్రత్తిపాడు రూరల్: కాకినాడ– ప్రత్తిపాడు జాతీయ రహదారిపై రెండు బైక్‌లు ఢీకొన్న ఘటనలో ఒకరు మృతి చెందగా, మరొకరికి గాయాలయ్యాయి. అదే సమయంలో జిల్లా కలెక్టర్ షణ్మోహన్ ఏలేశ్వరంలోని ఏలేరు జలాశయాన్ని పరిశీలించి తిరిగి వస్తుండగా ధర్మవరం వద్ద ప్రమాదంలో గాయపడిన క్షతగాత్రులను గుర్తించారు. వెంటనే చలించిన కలెక్టర్ మానవతా దృక్పథంతో ఆయన ప్రోటోకాల్ వాహనంలో ప్రత్తిపాడు సీహెచ్‌సీకి క్షతగాత్రులను తరలించారు. అనంతరం సీహెచ్‌సీ ఆర్ఎంఓ సౌమ్యకు ఫోన్ చేసి క్షతగాత్రులకు మెరుగైన వైద్యం అందించాలని ఆదేశించారు. ఆ వివరాల్లోకి వెళ్తే.. గొల్లప్రోలు మండలం చెందుర్తి గ్రామానికి చెందిన ఆర్ఎంపీ డాక్టర్ సిద్దాంతపు ముసలారావు వన్నెపూడి గ్రామంలో డ్వాక్రా యానిమేటర్‌గా కూడా బాధ్యతలు నిర్వహిస్తున్నారు. విధి నిర్వహణలో భాగంగా చెందుర్తి నుంచి బైక్‌పై ధర్మవరం యూనియన్ బ్యాంకుకు బయలు దేరారు. జాతీయ రహదారి పైనుంచి ధర్మవరం గ్రామంలోకి వెళ్తుండగా ఈ బైక్‌కు వెనుక వస్తున్న గొల్లప్రోలుకు చెందిన బొమ్మిడి బాబి, పొన్నాడ హరిగంగాధర్‌లకు చెందిన బైక్ బలంగా ఢీకొంది. ఈ ఘటనలో సిద్దాంతపు ముసలారావు (52), పొన్నాడ హరిగంగాధర్ (బైక్ వెనుక కూర్చున్న యువకుడు)లు గాయాలపాలై అపస్మారక స్థితిలోకి వెళ్లారు. వీరిని కలెక్టర్ షణ్మోహన్ అతని వాహనంలో ఆసుపత్రికి తరలించారు. ఇందులో సిద్దాంతపు ముసలారావు అప్పటికే మృతి చెందినట్లు వైద్యులు ధ్రువీకరించారు. మృతుడు పాతికేళ్ల క్రితం దుర్గాడ నుంచి చెందుర్తి వచ్చి ఇక్కడ ఆర్ఎంపీగా స్థిరపడ్డాడు. గాయపడిన పొన్నాడ హరిగంగాధర్ పిఠాపురంలో ఐఐటీ మొదటి సంవత్సరం చదువుతున్నాడు. రాజానగరంలో పరీక్ష రాసేందుకు వెళ్తుండగా ఈ ప్రమాదం జరిగింది. ఘటనా ప్రాంతాన్ని తహసీల్దార్ సూర్యప్రభ, సీహెచ్‌సీ ఆర్ఎంఓ పరిశీలించారు. మృతుడికి ముగ్గురు కుమార్తెలు ఉన్నారు. ప్రత్తిపాడు పోలీసులు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.



ముసలారావును ఆసుపత్రికి తీసుకు వస్తున్న కలెక్టర్ భద్రతా సిబ్బంది



గాయపడిన పొన్నాడ హరిగంగాధర్



మృతుడు సిద్దాంతపు ముసలారావు (ఫైల్)

ప్రకృతి సాగుతో ఎంతో మేలు

రాజమహేంద్రవరం రూరల్: ప్రపంచానికి సవాలుగా మారిన వాతావరణ కాలుష్యం, పెరుగుతున్న ఉష్ణోగ్రత తదితర సమస్యలను ప్రకృతి వ్యవసాయంతో పరిష్కరించవచ్చునని జిల్లా వ్యవసాయాధికారి ఎస్.మాధవరావు అన్నారు. ఇన్నీసుపేటలోని ఫంక్షన్ హాల్లో బుధవారం ఆయన అధ్యక్షతన ప్రకృతి వ్యవసాయంపై ఏడీఏలకు, ఏవోలకు వర్క్‌షాప్ ప్రారంభమైంది. రెండు రోజులు నిర్వహించే ఈ కార్యక్రమంలో డీఏవో మాధవరావు మాట్లాడుతూ ప్రకృతి వ్యవసాయం వల్ల కలిగే ప్రయోజనాలను వివరించారు. కార్యక్రమంలో ప్రకృతి వ్యవసాయం జిల్లా ప్రాజెక్టు మేనేజర్ తాతారావు, డీఆర్‌సీ ఏడీఏ జయలక్ష్మి, అడిషనల్ డీపీఎం వల్లి, డాట్ శాస్త్రవేత్త నరసింహారావు పాల్గొన్నారు.

కొబ్బరి ధరహాసం

- పండగలతో అంబాజీపేట మార్కెట్‌లో పెరిగిన ధర
- వెయ్యి నీటి కాయలు రూ.12 వేలు
- ఉత్తరాదికి పెరిగిన ఎగుమతులు

సాక్షి, అమలాపురం/ అంబాజీపేట: కొబ్బరి మార్కెట్ కళకళలాడుతోంది. వరుస పండగలు కావడంతో కొబ్బరి కాయల ధర అంచనాలకు మించి పెరుగుతోంది. ప్రస్తుతం అంబాజీపేట కొబ్బరి మార్కెట్‌లో నీటికాయ (నెల రోజుల ముక్కుడు కాయ) వెయ్యి ధర రూ.12 వేలకు చేరింది. పచ్చి కాయ ధర రూ.11 వేలు పలుకుతోంది. వారం రోజుల కిందట నీటికాయ వెయ్యి ధర కేవలం రూ.పది వేలు మాత్రమే ఉండేది. గడిచిన వారం రోజుల్లో ఏకంగా రూ.రెండు వేలు పెరగడం కొబ్బరి మార్కెట్‌లో ఉత్సాహాన్ని నింపింది. ఉత్తరాది రాష్ట్రాల నుంచి వస్తున్న ఆర్డర్లతో కొబ్బరికాయ ధర పెరుగుతోంది. కొబ్బరికి మంచి రోజులు వచ్చాయి. ధర పెరుగుతూ వస్తోంది. శ్రావణ మాసం తరువాత ఈ నెల వినాయక చవితి ఉత్సవాలు, అక్టోబర్ 12న దసరా ఉత్సవాలు, అదే నెల 31న దీపావళి, తరువాత నుంచి కార్తిక మాసం ఇలా వరుస పండగలతో కొబ్బరి కాయకు డిమాండ్ ఏర్పడింది. దీనికితోడు దిగుబడి తగ్గడం కూడా కాయ ధర పెరగడానికి కారణమైంది. ఎకరాకు ప్రస్తుతం సగటున 500 కాయల దిగుబడి మాత్రమే వస్తోంది. సాధారణంగా ఆగస్ట్, సెప్టెంబర్ నెలల దిగుబడి కనీసం 900 నుంచి వెయ్యి కాయల వరకూ ఉంటోంది. ఈ సమయంలో ఉమ్మడి ఉభయ గోదావరి జిల్లాల నుంచి ఉత్తరాది రాష్ట్రాలైన గుజరాత్, రాజస్తాన్, హర్యానా, ఉత్తర ప్రదేశ్, ఉత్తరాఖాండ్, మధ్యప్రదేశ్, ఛతీస్‌ఘడ్, ఒడిశా, పశ్చిమ బెంగాల్, బీహార్ రాష్ట్రాలకు 120 నుంచి 150 లారీల వరకు పచ్చికాయల ఎగుమతి అయ్యేది. ఇప్పుడు ధర ఉన్నా కేవలం 60 నుంచి 80 లారీల కొబ్బరికాయలు మాత్రమే ఎగుమతి కావడం వెనుక దిగుబడి తగ్గడమే కారణమని వ్యాపారులు చెబుతున్నారు. ఉమ్మడి తూర్పు గోదావరి జిల్లాలో సుమారు 1.30 లక్షల ఎకరాల్లో కొబ్బరి సాగు జరుగుతుండగా, ఏటా 122.50 కోట్ల కాయలు దిగుబడిగా వస్తోందని అంచనా. అంబాజీపేట మార్కెట్ ధరలపైనే ఉమ్మడి ఉభయ గోదావరి జిల్లాల కొబ్బరి ధరల నిర్ణయం జరుగుతోంది. ఇక్కడ పెరగడం, తగ్గడంపైనే మిగిలిన ప్రాంతాల్లో కొబ్బరి ధరల్లో మార్పులు చోటు చేసుకుంటాయి.

రాశులు లేక దిగాలు

కొబ్బరి ధర పెరిగినా రైతుల వద్ద అనుకున్న స్థాయిలో రాశులు లేవు. ఇప్పటికే మూడొంతుల కాయ వ్యాపారుల వద్ద ఉంది. మే నెలలో నాఫెడ్ కేంద్రాలు తెరిస్తే కొబ్బరి కాయలకు డిమాండ్ వస్తోందని రైతులు భావించారు. ఇందుకు తగినట్టుగా ఏప్రిల్ నుంచి జూన్ వరకు వచ్చిన కాయలను తమ వద్దే రాశులుగా ఉంచుకున్నారు. కానీ కూటమి ప్రభుత్వం నాఫెడ్ కేంద్రాలను జూలై మొదటి వారంలో కాని తెరవలేదు. తెరిచిన తరువాత స్థానికంగా ఉన్న ఎండు కొబ్బరిని కొనుగోలు చేయకుండా కేరళ, తమిళనాడు నుంచి దొడ్డిదారిన తెచ్చిన కొబ్బరి కొనుగోలు చేస్తున్నారు. దీంతో స్థానిక కొబ్బరికి ధర రాలేదు. ఈ విధానం చూసిన రైతులు తమ వద్ద ఉన్న కొబ్బరి రాశులను ఆగస్టులోనే వ్యాపారులకు అమ్మేశారు. మూడొంతుల దిగుబడి వ్యాపారుల వద్దకు చేరిన తరువాత ధర పెరగడం విశేషం. మార్కెట్‌లో కొబ్బరి పెరిగిన ఆనందం రైతులకు పూర్తి స్థాయిలో లేకుండా పోయింది. వచ్చే దింపు వరకూ ఈ ధర ఉంటే కొంత మేలని రైతులు చెబుతున్నారు. దిగుబడి తక్కువగా ఉండడం, పండగల మార్కెట్ ఉన్నందున ధర మరింత పెరిగే అవకాశముందని వ్యాపారులు అంచనా వేస్తున్నారు.



అంబాజీపేటలో వ్యాపారుల వద్ద ఉన్న కొబ్బరి రాశి

అయినా నిరాశే..



పండగ సీజన్‌లో కొబ్బరి ధరలు పెరిగి ఆర్థిక ఇబ్బందులను తొలగుతాననుకుంటే నిరాశే ఎదురవుతోంది. కొబ్బరికాయలు ఉన్న రోజుల్లో ధర ఉండడం లేదు. ధర ఉంటే కొబ్బరి దిగుబడులు కానరావడం లేదు. ఎప్పుడు ఏ సమయంలో ధరలు పెరుగుతాయో, తగ్గుతాయో అర్థం కాని పరిస్థితి. ప్రస్తుతం కొబ్బరి ధరలు పెరిగినప్పటికీ కాయలు లేక పెద్దగా ఆదాయం రావడం లేదు.

–కూనపురెడ్డి వెంకట్రావు, కొబ్బరి రైతు, ఇరుసుమండ, అంబాజీపేట మండలం

సమాజ శిల్పులు ఉపాధ్యాయులు

- నేడు జిల్లా ఉత్తమ అవార్డుల ప్రదానం
- ఏర్పాట్లు చేసిన ఉమ్మడి జిల్లా యంత్రాంగం

రాయవరం/ బాలాజీచెరువు (కాకినాడ)/ కంబాలచెరువు (రాజమహేంద్రవరం): సమాజ శిల్పులు ఉపాధ్యాయులు.. వీరికి స్ఫూర్తిగా నిలిచే డాక్టర్ సర్వేపల్లి రాధాకృష్ణన్ జయంతిని ఏటా సెప్టెంబర్ 5న ఉపాధ్యాయ దినోత్సవంగా నిర్వహించుకుంటున్నాం. ఇందులో భాగంగానే గురువారం ఉమ్మడి తూర్పు తూర్పుగోదావరి వ్యాప్తంగా గురుపూజోత్సవం నిర్వహించుకునేందుకు యంత్రాంగం సన్నద్ధమవుతోంది. కోనసీమకు సంబంధించి అమలాపురం కలెక్టరేట్‌లోని గోదావరి భవన్‌లో జిల్లా స్థాయి ఉపాధ్యాయ దినోత్సవాన్ని ప్రభుత్వం తరఫున ఘనంగా నిర్వహించనున్నారు. దీనికోసం జిల్లా యంత్రాంగం కూడా అన్ని ఏర్పాట్లు చేస్తోంది. ప్రభుత్వ, మండల పరిషత్, జెడ్పీ, మున్సిపల్, ఎయిడెడ్, ఏపీ రెసిడెన్షియల్, సోషల్ వెల్ఫేర్ రెసిడెన్షియల్ ప్రాథమిక, ప్రాథమికోన్నత, ఉన్నత పాఠశాలల్లో విద్యాబుద్ధులు నేర్పుతున్న ఉపాధ్యాయులకు జిల్లా ఉత్తమ ఉపాధ్యాయ అవార్డులను ప్రదానం చేయనున్నారు. ఈ జిల్లాలో ఉత్తమ అవార్డులకు 42 మంది ఉపాధ్యాయులను ఎంపికయ్యారు.



డాక్టర్ సర్వేపల్లి రాధాకృష్ణన్

- కాకినాడ జిల్లాలో గురుపూజోత్సవానికి అన్ని ఏర్పాట్లు చేశారు. పాఠశాల విద్యా శాఖ ఆధ్వర్యంలో జేఎన్‌టీయూకే ఆడిటోరియంలో ఈ వేడుకలు జరుగుతాయని డీఈఓ పిల్లి రమేష్ తెలిపారు. ఈ సందర్భంగా 70 మంది ఉపాధ్యాయులకు జిల్లా ఉత్తమ అవార్డులను ప్రదానం చేస్తామన్నారు. ఇందులో ప్రజాప్రతినిధులు, అధికారులు పాల్గొంటారన్నారు.
- తూర్పుగోదావరి జిల్లాకు సంబంధించి ఉత్తమ ఉపాధ్యాయులుగా 70 మందిని ఎంపిక చేశామని డీఈఓ కె.వాసుదేవరావు తెలిపారు. జిల్లా కలెక్టర్ అధ్యక్షత ఏర్పడిన కమిటీ ఉత్తమ ఉపాధ్యాయుల ఎంపికను నిర్వహించింది. వీరికి రాజమహేంద్రవరం ఆనం కళాకేంద్రంలో అవార్డులను అందించి సత్కరిస్తారు. ఉత్తమ ఉపాధ్యాయులుగా ఎంపికైన వారు ఉదయం 8 గంటలకే హాజరు కావాలని డీఈఓ కోరారు.

రైల్వేలైన్ అలైన్‌మెంట్‌పై అభ్యంతరాలు తెలపండి

అమలాపురం రూరల్: కోటిపల్లి– నరసాపురం రైల్వే లైన్ ప్రస్తుత అలైన్‌మెంట్‌పై గ్రామాల వారీగా సర్వే చేసి ప్రజలు, ప్రభుత్వ శాఖల నుంచి అభ్యంతరాలను స్వీకరించాలని జాయింట్ కలెక్టర్ టి.నిషాంతి అధికారులను ఆదేశించారు. బుధవారం అమలాపురం మండలం భట్నవిల్లిలో ఆమె పర్యటించారు. ఈ సందర్భంగా నిషాంతి మాట్లాడుతూ కోటిపల్లి– నరసాపురం ప్రతిపాదిత రైల్వే లైన్ అలైన్‌మెంట్ అమలాపురం రూరల్ మండలంలో భట్నవిల్లి, కామనగరువు, రోళ్లపాలెం, పేరూరు, ఇమ్మిడివరప్పాడు గ్రామాల మీదుగా వెళ్తుందన్నారు. ఆయా గ్రామాల్లో రైల్వే అలైన్‌మెంట్‌కు అడ్డుగా రోడ్లు, కాలువలు, విద్యుత్ లైన్లు, స్తంభాలు, ఓఎన్జీసీ, గెయిల్ పైపులైన్లు, ఆర్‌డబ్ల్యూఎస్ ట్యాంకులు, నివాసాలు ఉన్నాయా లేదా అని సర్వే చేసి ప్రజలు, ప్రభుత్వ శాఖల నుంచి అభ్యంతరాలను సూచించిన ప్రొఫార్మాలో ఈ నెల 17 లోపు సమర్పించాలని ఆదేశించారు. తహసీల్దార్ జేడీ కిశోర్‌బాబు, రెవెన్యూ, సర్వే అధికారులు పాల్గొన్నారు.



భట్నవిల్లిలో రైల్వే లైన్ అలైన్‌మెంట్‌ను పరిశీలిస్తున్న జేసీ నిషాంతి